సాక్షి అనకాపల్లి

శనివారం । 29 । జూలై । 2023



నేత్రపర్వంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం నేత్రపర్వంగా జరిగింది.



ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు

విశాఖ: బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం పాఠశాలల్లో ఫిర్యాదుల పెట్టెను ప్రారంభించారు.

స్వల్ప వర్షసూచన

అనకాపల్లిటౌన్: రాగల ఐదు రోజులు స్వల్ప వర్షసూచన ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంజీజీస్ కుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న 2 మి.మీ., 30న 2, 31న 4, ఆగస్ట్ 1న 15, 2న 14 మి.మీ. వర్ష పాతం కురుస్తుందని, 32 నుంచి 32.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్నారు.

న్యూస్‌రీల్

డీసీసీబీ చైర్మన్‌గా గురువులు ప్రమాణ స్వీకారం నేడు



సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్‌గా కోలా గురువులు శనివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు డీసీసీబీ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీటీడీ చైర్మన్, విశాఖ, విజయనగరం, అనకాపల్లి జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, నగర మేయర్ హరివెంకట కుమారి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, వార్డు కార్పొరేటర్లు, అధ్యక్షులు, ఎంపీపీలు హాజరుకానున్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

మహారాణిపేట(విశాఖ దక్షిణ): వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పలు పోస్టుల భర్తీకి డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు నోటిఫికేషన్ జారీ చేశారు. జిల్లాలో వివిధ ప్రొగ్రాంల కింద పని చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. డిస్ట్రిక్ ప్రొగ్రాం కో–ఆర్డినేటర్(ఒక పోస్టు), డాట్స్, టీబీ, హెచ్ఐవీ సూపర్‌వైజర్(ఒక పోస్టు), పీపీఎం కోఆర్డినేటర్(ఒక పోస్టు), టీబీ హెల్త్ విజిటర్(ఒక పోస్టు), అకౌంటెంట్(ఒక పోస్టు), డెంటల్ మెడికల్ ఆఫీసర్స్(రెండు పోస్టులు), ఐసీటీసీ కౌన్సిలర్(రెండు పోస్టులు), ఏఆర్‌టీ కౌన్సిలర్(ఒక పోస్టు), ఏఆర్‌టీ డేటా మేనేజర్(ఒక పోస్టు), ఐసీటీసీ ల్యాబ్ టెక్నీషియన్(2 పోస్టులు), బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్(ఒక పోస్టు), డేటా మేనేజర్(ఒక పోస్టు), స్టాఫ్ నర్స్(మూడు) పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో నియామకం చేస్తున్నారు. ఒక సంవత్సరం కాల పరిమితితో పని చేయడానికి అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను వచ్చేనెల ఒకటో తేదీ సాయంత్రం 5 గంటల్లోగా రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేయాలని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం https// visakhapatnam.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం




ఎగ్జిబిషన్ తిలకిస్తున్న సెట్విస్ అధికారులు

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జిల్లా యువజన సర్వీసుల శాఖ, సెట్విస్ ఆధ్వర్యంలో స్థానిక లంకపల్లి బుల్లయ్య కళాశాలలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, ఎగ్జిబిషన్ నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సెట్విస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ ఏడాది ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ప్రమాద స్థాయికి పెద్దేరు

- 300 క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల



పెద్దేరు గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తున్న దృశ్యం

మాడుగుల: మండలంలో అత్యంత జలవనరులు గల పెద్దేరు జలాశయం శుక్రవారం సాయంకాలానికి ప్రమాద స్థాయికి చేరుకుంది. జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి 250 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. దీంతో జలాశయం అధికారులు రెండు గేట్ల ద్వారా 300 క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం గరిష్ట నీటి మట్టం 137 మీటర్లు కాగా 136.60 మీటర్లకు చేరుకోవడంతో వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పెద్దేరు పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు, రైతులు రాత్రి పూట పెద్దేరులోకి దిగరాదని జలాశయం అధికారులు హెచ్చరించారు.

కళ్ల ‘కలక’లం

- జిల్లాలో విజృంభిస్తున్న ‘ఐ’ ఇన్‌ఫెక్షన్
- అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో మందులు
- చిన్నారులకు త్వరగా వ్యాపిస్తున్న కళ్ల కలక
- 14 వైద్య బృందాలతో కంటి పరీక్షలు
- ప్రభుత్వ స్కూళ్లలో ముందస్తుగా యాంటీబయోటిక్ డ్రాప్స్





సాక్షి, అనకాపల్లి/ అనకాపల్లి రూరల్: కళ్ల కలక.. ప్రస్తుతం జిల్లాలో ఎక్కువ మందిని వేధిస్తున్న ఆరోగ్య సమస్య. వాతావరణ పరిస్థితుల్లో మార్పుల కారణంగా ఈ కంటి ఇన్‌ఫెక్షన్ వస్తుంది. వర్షాల వల్ల మరింతగా వ్యాపిస్తోంది. జిల్లాలోని ఆస్పత్రులన్నీ కళ్ల కలక బాధితులతో కిటకిటలాడుతున్నాయి. వీరిలో చిన్నారులు, విద్యార్థులే ఎక్కువగా ఉంటున్నారు. పాఠశాలల్లో ఒకరి నుంచి మరొకరికి ఈ ఇన్‌ఫెక్షన్ త్వరగా వ్యాప్తి చెందుతోంది. ఇది అంటువ్యాధి అయినందున గాలి ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందుతోంది. దీంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులను అందుబాటులో ఉంచింది. చిన్న పిల్లల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కళ్ల కలక వలన పెద్దగా ముప్పు లేనప్పటికీ అప్రమత్తత అవసరమని, తగిన జాగ్రత్తలు తీసుకుంటే త్వరగా ఉపశమనం లభిస్తుందని కంటి వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు

కళ్ల కలకతో బాధ పడుతున్న వారికి తక్షణ వైద్య సేవలు అందించేందుకు వైద్యాధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. అనకాపల్లిలోని ఎన్టీఆర్ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి, 6 సీహెచ్‌సీలు, 45 పీహెచ్‌సీలు, 9 అర్బన్ హెల్త్ సెంటర్లు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో కళ్ల కలక మందులు అందుబాటులో ఉంచారు. జిల్లావ్యాప్తంగా 14 కంటి వైద్య బృందాలతో ప్రతి సచివాలయ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థులు, చిన్నారులకు ముందస్తుగా కంటిలో యాంటీబయోటిక్ డ్రాప్స్ వేసి, ‘విటమిన్–ఎ’ టాబ్లెట్స్ అందజేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న 3 లక్షలకు పైగా విద్యార్థులకు ముందస్తు డ్రాప్స్ వేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామాల్లో నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ క్యాంప్‌లో కూడా ఆప్తమాలజీ వైద్యుల సేవలు అందిస్తున్నారు.

ఇవీ లక్షణాలు

కళ్లు ఎర్ర బారడం, నీరు కారడం, కంటిలో నలక పడినట్టు అనిపించడం, రెప్పలు వాచడం, కళ్లు అంటుకోవడం, తలనొప్పి, లింఫ్‌నోడ్స్ వాపు వంటి లక్షణాలు కనిపిస్తాయి. బ్యాక్టీరియా, వైరస్, ఎలర్జీ, దుమ్ము, ధూళి కారణంగా కళ్ల కలక వస్తుంది. ప్రస్తుతం కల్ల కలక వైరస్ వల్ల వ్యాపిస్తోందని వైద్యులు చెబుతున్నారు.

ఆందోళన వద్దు



కళ్ల కలక అంటు వ్యాధి కావడంతో వేగంగా వ్యాప్తి చెందుతుంది. వర్షాకాలంలో ఎక్కువగా వస్తుంది. వ్యాధి సోకినవారు ఆందోళన చెందాల్సిన అవసరంలేదు. చుక్కల మందు వాడితే తగ్గిపోతుంది.

– డాక్టర్ హేమంత్, డీఎంహెచ్‌వో

అప్రమత్తంగా ఉండాలి..



కళ్ల కలక సోకినవారు వీలైనంత వరకు ఇతరులతో కలవకుండా ఉంచడం మంచిది. వారు వాడే వస్తువులను ఇతరులు ఉపయోగించకుండా చూడాలి. వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే నేత్ర వైద్యుడ్ని సంప్రదించాలి.

– డాక్టర్ జి.వి రమణకుమార్, జిల్లా అంధత్వ నివారణ అధికారి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

కళ్ల కలక బాధితులు గోరు వెచ్చని నీటితో కళ్లు శుభ్రపర్చుకోవాలి. కళ్లు నలప కూడదు. దానివల్ల కంటిలో నల్లపాప, కంటిపైన ఉండే పలుచని పొర దెబ్బతినే అవకాశం ఉంది. కళ్లు ఒత్తిడికి లోనుకాకుండా విశ్రాంతి నివ్వాలి. మిగతా వారు బాధితులకు కొంచెం దూరంగా ఉండడం, వారు వాడిన టవలు, సబ్బు వంటి వస్తువులు వాడకుండా ఉండడం, పొరపాటున ముట్టుకుంటే చేతులు శుభ్రం చేసుకోవడం చేయాలి. బాధితులు వైద్యులను సంప్రదించి సరైన యాంటీబయాటిక్ చుక్కల మందు, లూబ్రికేటింగ్ చుక్కల మందు, అవసరమైతే పెయిన్‌కిల్లర్ వాడాలి. పెద్దలకు, పిల్లలకు వేర్వేరుగా చుక్కల మందు ఉంటుంది. వేపకాయ ట్యూబు వాడవద్దని వైద్యులు సూచించారు.

ప్రజల సంతృప్తే పనితీరుకు గీటురాయి



జగనన్నకు చెబుదాం సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి నివాస్

- ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమం అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- ప్రతి అర్జీని పరిష్కరించాలి: జిల్లా ప్రత్యేక అధికారి నివాస్

తుమ్మపాల: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించి సంతృప్తి స్థాయి పెంచేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుడు జె.నివాస్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, సకాలంలో సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. శాఖల వారీగా పెండింగ్ అర్జీలపై సమీక్షిస్తూ ఏ ఒక్క వినతి ఎస్ఎల్ఏ దాటి వెళ్లకూడదని సూచించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి లబ్ధిదారుల సమక్షంలోనే పరిష్కరించేందుకు దృష్టి పెట్టాలన్నారు. రెవెన్యూ, పంచాయతీ, సర్వే శాఖలు సంతృప్తి రేటుపై మరింత దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ స్మరణ్‌రాజ్, డీఆర్వో పి.వెంకటరమణ, పీఎస్సీ విజయభాస్కర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తంతడి పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



తంతడి పీహెచ్‌సీలో ఫ్యామిలీ డాక్టర్ అమలుపై ఆరా తీస్తున్న నివాస్

అచ్యుతాపురం (అనకాపల్లి): ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌పై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేలా వైద్య అనుబంధ సిబ్బంది కృషి చేయాలని రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ సూచించారు. తంతడి గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలు, పనితీరుపై ఆరా తీశారు. శిబిరానికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వైద్య సేవలందుతున్న తీరు గురించి తెలుసుకున్నారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సహాయకులు, ఎంఎల్‌హెచ్‌పీలు మరింత చురుకుగా ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డీఎంహెచ్‌వో డి.హేమంత్‌కుమార్, నోడల్ పర్సన్ డాక్టర్ జ్యోతి, సర్పంచ్ మురళి, వైద్యాధికారి అలేఖ్య, వైద్య, రెవెన్యూ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

విశాఖ విద్య: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఎల్. చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. 14 ఏళ్లు కలిగిన వారు పదో తరగతి ప్రవేశానికి అర్హులన్నారు. ఇంటర్మీడియెట్ కోర్సులో ప్రవేశం కోసం పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలన్నారు. ఆగస్టు 31 వరకు గడువు ఉందని, ఆసక్తి ఉన్న మరిన్ని వివరాల కోసం సమీపంలోని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లో సంప్రదించాలన్నారు.

ఏయూతో రక్షణ రంగాల అధికారుల సమావేశం

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంతో పలు రాష్ట్రాల రాజ్ సైనిక్ బోర్డు, నేవీ, ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. వర్చువల్ విధానంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణ మోహన్ పాల్గొన్నారు. దేశ రక్షణ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగలు విద్యార్హతలు, నైపుణ్యాలు, వృత్తి అనుభవాలను పరిగణలోనికి తీసుకుని వారికి డిగ్రీలను ప్రధానం చేసే దిశగా మరింత పటిష్టంగా పనిచేయాలని నిర్ణయించారు. వీరికి ఆర్ట్స్, సైన్స్, ఇంజినీరింగ్ కోర్సుల్లో సర్టిఫికెట్లు ప్రధానం చేసే విధివిధానాలపై చర్చించారు. దీనికోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్‌లో సమాచారం పంచే ప్రక్రియను తయారు చేశారు.

సైనికోద్యోగులకు ఉన్నత విద్యను అందించే విధంగా ఏయూ చేపడుతున్న ఉపయుక్త కార్యక్రమాలను సైనికాధికారులు సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో సైతం ఇదేవిధమైన సహకారం అందించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ డీన్ ఆచార్య కె.నిరంజన్, పరీక్షల విభాగం డీన్ ఆచార్య డి.వి.ఆర్ మూర్తి, కంప్యూటర్ సెంటర్ సంచాలకులు ఆచార్య భాస్కర రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, కంప్యూటర్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వర్చువల్ సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

గంజాయి రవాణాపై నిరంతర నిఘా

- 83 కేసుల్లో 215 మంది అరెస్టు
- 2778 కేజీల గంజాయి స్వాధీనం
- ఎస్పీ మురళీకృష్ణ వెల్లడి

మాకవరపాలెం: గంజాయి రవాణాపై నిరంతర నిఘా ఉంటుందని ఎస్పీ మురళీకృష్ణ స్పష్టం చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. మండలంలో నమోదైన కేసులు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్ఐ రామకృష్ణారావును ఆదేశించారు. ఫిర్యాదుల నమోదులో తాత్సారం చేయరాదన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. దీని నివారణకు సీసీ కెమెరాలను అమర్చడంతోపాటు ప్రత్యేక బృందాలను నియమించామన్నారు. గంజాయి తరలిస్తూ పరారైన వారిని పట్టుకునేందుకు కూడా ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయన్నారు. గంజాయి రవాణాకు సంబంధించి ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 83 కేసుల్లో 215 మందిని అరెస్టు చేశామన్నారు. మొత్తం 35 వాహనాలను సీజ్ చేసి 2778 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇక పట్టుబడిన గంజాయి కేసుల్లో పరారైన 61 మందిని ప్రత్యేక బృందాల ద్వారా అరెస్టు చేశామన్నారు. గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చెక్ పోస్టులను కూడా ఏర్పాటు చేసి నిరంతరం వాహనాల తనిఖీలు చేస్తున్నట్టు చెప్పారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

బాధితులకు చట్టపరంగా న్యాయం చేయాలి

రాంబిల్లి: న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితులకు చట్టప్రకారం న్యాయం చేయాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదేశించారు. శుక్రవారం రాత్రి ఆయన రాంబిల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, పలు కేసుల విషయమై ఎస్ఐ దీనబంధును ఆరా తీశారు. సెజ్, నేవల్‌బేస్ ఈ స్టేషన్ పరిధిలో వుండటంతో నిత్యం అప్రమత్తంగా వుండాలని ఆదేశించారు. న్యాయం కోసం వచ్చిన ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, సీఐ గఫూర్ పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిలో హెచ్‌ఆర్ కీలకం

- సీఐఐ ఏపీ వైస్ చైర్మన్ డాక్టర్ మురళీకృష్ణ



మాట్లాడుతున్న డాక్టర్ మురళీకృష్ణ

సాక్షి, విశాఖపట్నం: ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధిలో హెచ్‌ఆర్ నిపుణుల పాత్ర కీలకమని సీఐఐ ఏపీ వైస్ చైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో హెచ్‌ఆర్ కాంక్లేవ్ పేరిట సీఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కోవిడ్ అనంతరం ఏడాది తర్వాత ఐటీ సంస్థల మానవ వనరుల నిపుణులు తమ ఉద్యోగులను తిరిగి ఆఫీసులకు రప్పిస్తున్నారన్నారు. వారిలో నైపుణ్యాభివృద్ధి, వైవిధ్యం, భద్రతలకు వీలుగా హెచ్‌ఆర్ నిపుణులు కృషి చేస్తున్నారని చెప్పారు. సీఐఐ పూర్వ చైర్మన్ డి.రామకృష్ణ మాట్లాడుతూ వివిధ కంపెనీలు వేగంగా మార్పులను ఎదుర్కొంటున్నందున వాటి నిర్వాహకులు సంస్థల అభివృద్ధికి కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారని చెప్పారు. ఇందులో మార్పు, సంస్కృతి విజయానికి కీలకమన్నారు. ప్యారడైజ్ ఫుడ్‌కోర్టు ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ, సీఈవో గౌతమ్ గుప్తా మాట్లాడుతూ పని సంస్కృతి చాలా ముఖ్యమని, కాలానుగుణంగా సందర్భానుసారం ఉద్యోగులను ప్రసంశించడం, వారిని గుర్తించడం మంచి ఫలితాలనిస్తుందన్నారు. సీఐఐ విశాఖ హెచ్‌ఆర్ ప్యానెల్ కన్వీనర్, వైస్ ప్రెసిడెంట్ పీఎస్ ఠాగూర్ మాట్లాడుతూ సానుకూల దృక్పథం మంచి ఫలితాలను, సత్సంబంధాలను పెంపొందిస్తుదన్నారు.

వ్యాపార ప్రక్రియల్లో సాంకేతికతను వినియోగించుకోవడం చాలా ముఖ్యమన్నారు. హైదరాబాద్ టీసీఎస్ హెచ్‌ఆర్ హెడ్ శ్రీకాంత్ సూరంపూడి మాట్లాడుతూ తమ హెచ్‌ఆర్ టెక్నాలజీని ఎలా డిజైన్ చేయాలి, ఎలా ఉపయోగించాలి అనే అంశాల్లో ప్రజలను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. వ్యాపార విజయానికి ఉద్యోగి అనుభవం కీలకమని ఆయా సంస్థలు తెలుసుకుంటున్నాయన్నారు. సదస్సులో పీపుల్ అండ్ కల్చర్ హెడ్ సాలినీ నాయర్, అమేడియస్ సాఫ్ట్‌వేర్ ల్యాబ్స్ ఇండియా ప్రతినిధి అజిత్‌నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యా..



- 9440812487 నంబరుకు కాల్ చేయండి
- 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు అదనంగా పర్యవేక్షణ కేంద్రాల ఏర్పాటు
- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ ఉపకరణాలు, కనెక్షన్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచించారు. వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో కలుగుతున్న అంతరాయాలను పర్యవేక్షించడానికి జిల్లా కేంద్రాలలో ఉన్న సూపరింటెండింగ్ ఇంజనీర్ల కార్యాలయాలు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్/టెక్నికల్ నియంత్రణలో ప్రత్యేక పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఉన్న టోల్ ఫ్రీ నంబర్ 1912కు అదనంగా ఈ కేంద్రాలు పనిచేస్తాయని వివరించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాల వారు 9440812487 నంబరుకు కాల్ చేయవచ్చన్నారు. తుపాను లేదా భారీ వర్షాల వలన విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాలకు సంబంధించిన మరమ్మతు పనులు పూర్తయ్యేంత వరకూ 24/7గా ఈ పర్యవేక్షణ కేంద్రాలు పనిచేస్తాయని సీఎండీ పృథ్వీతేజ్ స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం, ఇతర సరఫరా సంబంధిత సమస్యలు పరిష్కరించేందుకు వివిధ సర్కిళ్ల పరిధిలో ఉన్న అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని విద్యుత్ వినియోగదారులకు సీఎండీ సూచించారు.

డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్‌కు టాలెంట్ ఐకాన్ అవార్డు



టాలెంట్ ఐకాన్ అవార్డుతో కృష్ణవీర్ అభిషేక్

దాబాగార్డెన్స్ : భాషావేత్త, రచయిత డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్‌కు విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్ టాలెంట్ ఐకాన్ అవార్డును బహూకరించింది. కృష్ణవీర్ అభిషేక్ సాహితీ కృషికి గుర్తింపుగా ఏపీ టూరిజం అథారిటీ రీజనల్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి శుక్రవారం నగరంలోని ఓ హోటల్లో ఈ అవార్డును అందజేశారు.

ఇనార్బిట్ మాల్ శంకుస్థాపనకు ఏర్పాట్లు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): జీవీఎంసీ 45వ వార్డు పోర్టు ఆస్పత్రి సమీపంలో రహేజా గ్రూప్ సుమారు రూ.600 కోట్లతో నిర్మించనున్న ఇనార్బిట్ మాల్‌కు వచ్చే నెల 1న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి శంకుస్థాపన చేయనున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం శంకుస్థాపన ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోర్టుకు చెందిన సుమారు 17 ఎకరాల్లో నిర్మించనున్న ఈ మాల్ రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అతి పెద్దదిగా నిలువనుందని తెలిపారు. సుమారు 280కు పైగా కంపెనీలకు చెందిన ఔట్‌లెట్స్ ఈ మాల్‌లో ఉంటాయన్నారు. ఇందుకు అవసరమైన అనుమతులను ప్రభుత్వం నుంచి రహేజా గ్రూప్ యాజమాన్యం ఇప్పటికే తీసుకుందని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 5 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. 24 నెలల్లో ఈ మాల్ నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. విస్తరణలో భాగంగా భవిష్యత్తులో ఇదే ఆవరణలో ఒక ఐటీ టవర్‌ను కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి రహేజా గ్రూప్‌ను కోరారని, అందుకు వారు అంగీకరించారని మంత్రి తెలిపారు.



మంత్రి అమర్‌నాథ్‌కు ఏర్పాట్ల గురించి వివరిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

క్లుప్తంగా

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

- ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు అనకాపల్లి ఎస్పీ సూచన



అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణకు గౌరవ వందం చేస్తున్న కైలాసగిరి ఏఆర్ పోలీసులు

ఆరిలోవ(విశాఖ): నిందితులను కోర్టులకు తరలించినప్పుడు, కోర్టుల నుంచి జైలుకు తరలించినప్పుడు ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు పకడ్బందీగా ఎస్కార్ట్ విధులు నిర్వర్తించాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ సూచించారు. విశాలాక్షినగర్‌లో కైలాసగిరి ఏఆర్ పోలీస్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. పోలీస్ మైదానంలో పరేడ్ కమాండర్ రామకృష్ణారావు ఆధ్వర్యంలో సిబ్బంది కవాతు చేస్తూ ఆయనకు గౌరవ వందనం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరాలకు పాల్పడిన అంతర్ జిల్లాలకు చెందిన నిందితులను కోర్టులకు తరలించేటప్పుడు మరింత జాగరూకతతో వ్యవహరించాలన్నారు. అనంతరం నార్కొటిక్స్ శిక్షణ పూర్తి చేసుకుని ఇక్కడకు తీసుకురానున్న రెండు పోలీస్ జాగిలాలకు వసతి ఏర్పాట్లను పరిశీలించారు. ఆ జాగిలాలకు శరీర దారుఢ్యం కల్పించి, నేరస్తులను గుర్తించడంలో మరింత శిక్షణ ఇవ్వాలని డీఎస్పీ పి.నాగేశ్వరరావుకు ఆదేశించారు. ఏఆర్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, వెంకటరావు, సతీష్, అరవింద్ కిశోర్, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

గోవా టు శ్రీకాకుళం

- విశాఖ మీదుగా మద్యం తరలిస్తున్న ముఠాకు చెక్
- రైల్వేస్టేషన్‌లో అక్రమ మద్యం పట్టివేత
- ముగ్గురి అరెస్ట్.. 295 బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేస్తుకున్న గోవా మద్యం బాటిళ్లతో సెబ్ అధికారులు

డొండపర్తి: గోవా టు శ్రీకాకుళం వయా విశాఖపట్నం.. ఇది కొత్తగా స్టార్ట్ చేసిన బస్ సర్వీస్ కాదు.. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ అసలే కాదు.. అక్రమంగా రాష్ట్రాన్ని మద్యాన్ని తీసుకువచ్చేందుకు స్మగ్లర్లు ఎంచుకున్న రూటు. గోవా మద్యాన్ని దర్జాగా రాష్ట్రాలు దాటించిన ముఠాకు విశాఖలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు చెక్ పెట్టారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ.. అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను మహారాణిపేట సెబ్ అధికారులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 295 గోవా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. విజయనగరం జిల్లాకు చెందిన పాదిలావు సత్యనారాయణ గోవాలో మద్యం షాపు నుంచి రూ.26కు కొనుగోలు చేసి ఇక్కడి తీసుకువచ్చి తన సహచరుడైన విజయనగరం జిల్లాకు చెందిన ధనుంజయకు బాటిల్ రూ.92కు విక్రయిస్తుంటాడు. దాన్ని ధనుంజయ శ్రీకాకుళం జిల్లాకు చెందిన గొర్లె లక్ష్మీనాయుడుకు రూ.100 అమ్ముతుంటాడు. లక్ష్మీనాయుడు తన గ్రామంలో ఒక్కో బాటిల్ రూ.120కు విక్రయిస్తుంటాడు. ఇలా అక్రమ మార్గంలో మద్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న ఈ ముఠాకు విశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు ఆధ్వర్యంలో అడ్డుకట్ట వేశారు. ఎప్పటిలాగే సత్యనారాయణ గోవాలో మద్యాన్ని కొనుగోలు చేసి అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలులో విశాఖకు తీసుకువచ్చాడు. విశాఖ రైల్వేస్టేషన్‌లో వీరు సరుకు మార్చుకుంటుండగా మహారాణిపేట సెబ్ సీఐ జగదీశ్వరరావు బృందం దాడులు చేసిన వారిని పట్టుకుంది. వారిని అదుపులో తీసుకుని వారి నుంచి 295 గోవా మద్యం బాటిళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు విశాఖ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు, జాయింట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఇదిలా ఉంటే మహారాణిపేట స్టేషన్ పరిధిలోని దాడుల్లో పట్టుబడిన మద్యాన్ని అధికారులు శుక్రవారం ధ్వంసం చేశారు. దాడుల్లో సీజ్ చేసిన నాలుగు వాహనాలకు వేలం నిర్వహించారు.

నేడు విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లను పరిశీలిస్తూ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8,9,10 తరగతుల విద్యార్థినులకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో శనివారం ఉచితంగా సైకిళ్ల పంపిణీ చేయనున్నట్టు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. క్రీడామైదానంలో సైకిళ్లను శుక్రవారం ఆయన పరిశీలించి, వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్, వైస్‌చైర్మన్ కె.నిత్యానందరెడ్డి చేతుల మీదగా సైకిళ్లను పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. రూ.1.75 కోట్ల విలువ చేసే సైకిళ్లను 2,550మంది బాలికలకు అందజేయనున్నట్టు తెలిపారు. టాటా కంపెనీకి చెందని ఒక్కో సైకిల్ ఖరీదు సుమారు రూ.6,500 ఉంటుందని ఆయన చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గంలో చదువుతున్న బాలికలకు కూపన్లు పంపిణీ చేశామని, కూపన్ తీసుకుని విద్యార్థినితో పాటు, తల్లిదండ్రుల్లో ఒకరూ రావాలని ఆయన కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుశాఖ ఆధ్వర్యంలో క్రీడామైదానంలో ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వి.సుబ్బరాజు, సీఐలు దాడి మోహనరావు, టి.శ్రీను, జెడ్పీ ఎస్.వెంకటరమణ, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

- అధికారులకు సీఎం వైఎస్ జగన్ ఆదేశం



సీఎం వైఎస్ జగన్ సమీక్షలో పాల్గొన్న జేసీ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, అల్లూరి ఎస్పీ తుహిన్ సిన్హా, అధికారులు

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్ర వ్యాప్తంగా భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారుల్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో వర్షాలు, నదుల్లో వరద ప్రవాహం, సహాయ పునరావాస కార్యక్రమాలపై వివిధ జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు జిల్లా నుంచి జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, డీఆర్వో ఎస్ శ్రీనివాసమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో తక్షణమే కంట్రోల్ రూమ్‌లు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

శరవేగంగా క్యాజువాల్టీ నిర్మాణం

మహారాణిపేట (విశాఖ): కేజీహెచ్‌లో రెండో క్యాజువాల్టీ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కార్పొరేట్ స్థాయిలో సేవలు అందిస్తున్న కేజీహెచ్‌కు క్రమంగా రోగుల సంఖ్య పెరుగుతుండడంతో.. ప్రస్తుతం క్యాజువాల్టీలో పడకలు సరిపోవడం లేదు. ఈ పరిస్థితుల్లో మరో క్యాజువాల్టీ నిర్మించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ చేసిన ప్రతిపాదనలకు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆమోద ముద్ర వేశారు. ఇందుకు అవసరమైన రూ.30 లక్షల నిధులను మంజూరు చేయడంతో టెండర్లు పిలిచి పనులకు శ్రీకారం చుట్టారు. రూ.15 లక్షలు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నుంచి, మరో రూ.15 లక్షలు సీఎస్సార్ నిధులతో 24x7 పని చేసే క్యాజువాల్టీని కార్పొరేట్ స్థాయిలో నిర్మిస్తున్నారు. రూ.15 లక్షలతో లేబొరేటరీ ఏర్పాటు చేస్తున్నారు. మొబైల్ ఎక్స్‌రే యూనిట్, అల్ట్రా స్కానింగ్ కూడా సిద్ధం చేస్తున్నారు. సెంట్రల్ ఎయిర్ కండీషన్, పడకలు, ఆక్సిజన్, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి..



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: మండలంలో గబ్బాడ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సమక్షంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు.క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీ సీనియర్ కార్యకర్త కోడి సోమరాజు ఆధ్వర్యంలో 20 కుటుంబాల వారు పార్టీలో చేరారు. కష్టపడి పనిచేసే వారికి వైఎస్సార్‌సీపీలో సముచితస్థానం ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, గురందరపాలెం సర్పంచ్ శానపతి వెంకటరత్నం, గ్రామ పార్టీ నాయకులు మాకిరెడ్డి సన్నిబాబు, మాకిరెడ్డి వెంకునాయుడు, నానాజీ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



అదృశ్యమైన మలిరెడ్డి కుమారి

దేవరాపల్లి: మండలంలోని తారువ గ్రామానికి చెందిన మలిరెడ్డి కుమారి(51)అనే మహిళ అదృశ్యమైనట్టు అందిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేశామని స్థానిక ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొంత కాలంగా కుమారికి మతిస్థిమితం సక్రమంగా లేదు. ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం పొలానికి వెళ్లి వస్తానని ఇంటి నుంచి బయలుదేరిన ఆమె తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. ఆమె భర్త మహాలక్ష్మీనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఆమె ఆచూకీ తెలిస్తే పోలీస్ స్టేషన్‌కు లేదా 9440796092 అనే ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ నాగేంద్ర కోరారు.

84 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి,కారు

చీడికాడ: కారులో తరలిస్తున్న 84 కిలోల గంజాయిని మండలంలోని శిరిజాం గదబూరు వద్ద మాడుగుల ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నట్టు ఎక్సైజ్ సీఐ ఎస్.సింహాద్రి తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు శిరిజాం గదబూరు వద్ద మాటు వేసినట్టు చెప్పారు. ఆ సమయంలో వచ్చిన కారును తనిఖీ చేయగా 84 కిలోల గంజాయి లభించినట్టు తెలిపారు. దీని విలువ రూ. 1.68 లక్షలు ఉంటుందని చెప్పారు. కారు,గంజాయిని సీజ్‌చేశామని, గంజాయి తరలిస్తున్న ముంబైకి చెందిన వివేక్ రంగనాథ్ త్రిపాఠి పట్టుకున్నట్టు చెప్పారు. ఈ కేసులో మరో ముగ్గురున్నట్టు గుర్తించామని వారి కోసం ప్రత్యేక టీంలతో గాలిస్తున్నామని చెప్పారు.

ఉపమాక సర్పంచ్ రాజీనామా



డీపీవోకు రాజీనామా పత్రం అందజేస్తున్న ఉప మాక సర్పంచ్ అప్పలనర్స

నక్కపల్లి: మండలంలో ఉపమాక సర్పంచ్ గొనగాల అప్పల నర్స శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈమేరకు డీపీవో ఆర్ శిరీషారాణికి ఆమె తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఆరోగ్యం సహకరించనందున తరచూ జరిగే సమావేశాలకు హాజరుకాలేకపోవడంతో సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు తెలియజేశారు.2021 ఫిబ్రవరి13న జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఉపమాక సర్పంచ్‌గా మనబానవానిపాలెం గ్రామానికి చెందిన గొనగాల చిన్నారావు సర్పంచ్‌గా ఎన్నికయ్యారు.కోవిడ్ కారణంగా 2021 మే 5న చిన్నారావు మరణించారు. దీంతో అక్కడ ఉప ఎన్నిక నిర్వహించారు. శాంతి భద్రతలు, గ్రామాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఎన్నికలు జరగకుండా ఏకగ్రీవంగా సర్పంచ్‌ను ఎన్నుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంగా మొదటి 20 నెలలు గొనగాల అప్పల నర్స సర్పంచ్‌గా, తదుపరి పంచాయతీ కాలపరిమితి పూర్తయ్యేవరకు మన బాల తాతారావు(గత ఎన్నికల్లో ఓటమి చెందిన వ్యక్తి) సర్పంచ్‌గా కొనసాగేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. నవంబరు 14న జరిగిన ఉప ఎన్నికల్లో చిన్నారావు తల్లి అప్పలనర్సను ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఒప్పందం ప్రకారం మొదటి 20 నెలలు పదవీకాలం పూర్తి కావడంతో పాటు వృద్ధాప్యం రీత్యా సర్పంచ్ పదవికి రాజీనామా చేశారు. ఆమె రాజీనామాను ఆమోదిస్తున్నట్టు డీపీవో ప్రకటించారు.తదుపరి జరిగే ఎన్నికల్లో మనబాల తాతారావును ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకునేందుకు గ్రామపెద్దలు తీర్మానించారు.నోటిఫికేషన్ వచ్చేవరకు ఉపసర్పంచ్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ పంచాయతీ కార్యాకలాపాలను మనబాల తాతారావు పర్యవేక్షణలో నిర్వహించేందుకు తీర్మానించుకున్నారు.

కుస్తీ పోటీల్లో 56మంది ఎంపిక



కుస్తీ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు

మునగపాక: ప్రతీ ఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అనకాపల్లి జిల్లా గ్రాప్లింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు టి.జ్యోతిర్మయి కోరారు. మండలంలోని నాగులాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం జిల్లాస్థాయి సబ్‌జూనియర్ కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఇక్కడ జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు శని, ఆదివారాల్లో అనకాపల్లిలో జరిగే మూడవ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లాస్థాయిలో జరిగిన కుస్తీపోటీల్లో అధికసంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. 26 మంది బాలికలు,30 మంది బాలురు వెరసి 56 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

చోడవరం రూరల్: మండలంలో కలకలం రేపిన బెన్నవోలులో జరిగిన హత్య కేసులో నిందితుడు పోతుమంతి ఆంజనేయులు అలియాస్ అంజిని అరెస్టు చేసి జ్యుడిషియల్ కస్టడీకి తరలించినట్టు కేసు దర్యాప్తు చేస్తున్న చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. రూ.50వేల బకాయి నిమిత్తం ఇరు కుటుంబాల మధ్య రేగిన వివాదం ఇద్దరిని బలిగొంది. గ్రామానికి చెందిన పోతుమంతి పోతురాజు కల్లం పాకల వద్ద నిద్రిస్తున్న సమయంలో శానాపతి పెద కన్నంనాయుడు గతంలో గొడ్డలితో తీవ్రంగా గాయపరిచాడు. ఆస్పత్రి పాలైన పోతురాజు చికిత్సపొంది ఇంటికి వచ్చిన కొద్దిరోజుల తరువాత మృతి చెందాడు. దీంతో అతని కుమారుడు పోతుమంచి ఆంజనేయులు బుధవారం రాత్రి కత్తితో కన్నంనాయుడు కుమారుడు అప్పారావుపై దాడి చేసి గాయపరచడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోతుమంచి ఆంజనేయులుపై హత్యకేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆంజనేయులు అలియాస్ అంజి(38)ని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు దళారుల బెడద

- సీఎంకు ఫిర్యాదు చేస్తాం : ఏపీయూఎఫ్ఐడీసీ డైరెక్టర్ వీసం



నక్కపల్లి: మండలంలో జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులనుంచి కొంతమంది నాయకులు, దళారులు వేలాది రూపాయలు వసూలు చేస్తున్నట్టు తమకు ఫిర్యాదులు వస్తున్నాయని, ఆధారాలు సేకరిస్తున్నామని వీటితో సీఎం కార్యాలయానికి వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తామని ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ ఇళ్ల మంజూరు చేయించడానికి, బిల్లులు చెల్లించడానికి ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.30వేలకు పైగా డిమాండ్ చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. మెరక గ్రామాల్లో ఈ దందా ఎక్కువగా జరుగుతోందని, రెండురోజులనుంచి పలువురు లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు ఈ అక్రమాలను తన దృష్టికి తీసుకు వచ్చారన్నారు. అధికారులకు ఇవ్వాలని చెప్పి ఈ వసూళ్లకు పాల్పడుతున్నారని, మామూళ్లు ఇవ్వని వారి బిల్లులు పెండింగ్‌లో పెట్టిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నాయని తెలిపారు. సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నవారినుంచి కూడా మామూళ్లు డిమాండ్ చేస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. మామూళ్లు ఇచ్చిన వారి, డిమాండ్ చేసిన వారి వివరాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. అన్ని ఆధారాలతో త్వరలోనే సీఎం కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేస్తామన్నారు. లబ్ధిదారులెవరూ ఒక్క పైసా లంచం ఇవ్వాల్సిన అవసరం లేదని తెలిపారు. అధికారులు డిమాండ్ చేస్తున్నారా, నాయకులే వసూలు చేస్తున్నారా అనేది నిగ్గు తేలుస్తామని చెప్పారు.

సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు



బూదరాళ్ల రహదారిలో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్ఐ, సిబ్బంది



ముంచంగిపుట్టులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ రవీంద్ర,పోలీసులు

సీలేరు : స్థానిక పోలీసుస్టేషన్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ రామకృష్ణ, సీఆర్‌పీఎఫ్ బలగాలతో కూంబింగ్ నిర్వహిస్తున్నారు. అనుమానిత వ్యక్తులను ఆరా తీస్తున్నారు. సరిహద్దు దాటుతున్న వాహనాలను తనిఖీ చేసి విడిచిపెడుతున్నారు. జెన్‌కో, ప్రభుత్వ ఆస్తులకు భద్రత కల్పించారు.రాత్రిపూట బస్సు సర్వీసులను నిలిపివేశారు.

ప్రభుత్వ కార్యాలయాల వద్ద గస్తీ

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శుక్రవారం ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు.మారుమూల బుంగాపుట్టు, భూసిపుట్టు,రంగబయలు పంచాయితీల నుంచి వచ్చే వాహనదారులను ప్రశ్నించి వారి లగేజీలు, బ్యాగ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితుల వివరాలు సేకరించి విడిచిపెట్టారు. జోలాపుట్టు, దోడిపుట్టు నైట్‌హాల్ట్ బస్సులను మండల కేంద్రానికే పరిమితం చేశారు. ప్రభుత్వ కార్యలయాల వద్ద రాత్రిపూట పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు.

చింతపల్లి రూరల్: మావోయిస్టుల సంస్మరణ వారోత్సవాలు సందర్భంగా భద్రత బలగాలను కట్టుదిట్టం చేశామని ఎస్ఐ రమణ తెలిపారు. శుక్రవారం మండలంలో లోతుగడ్డ బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు.

వై.రామవరం: వై.రామవరం - అడ్డతీగల ప్రధాన రహదారిలో శుక్రవారం ఎస్ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి విడిచిపెట్టారు. అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తులపై గట్టి నిఘా విధించారు. అడిషనల్ ఎస్ఐ కె.రాంబాబు పాల్గొన్నారు.

కొయ్యూరు: కొయ్యూరు సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో మంప ఎస్ఐ లోకేష్‌కుమార్, స్పెషల్ పార్టీ పోలీసులు బూదరాళ్ల రహదారిలో శుక్రవారం వాహనాల తనిఖీలు చేపట్టారు.

పెరుగుతున్న జోలాపుట్టు నీటిమట్టం



జలాశయం నుంచి విడుదల అవుతున్న నీరు

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరు అందించే ప్రధాన జోలాపుట్టు జలాశయ నీటిమట్టం పెరుగుతోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు రెండు పవర్ స్లూయిజ్ గేట్లు ఎత్తి రెండు వేల క్యూసెక్కుల నీటిని దిగువనున్న డుడుమ జలాశయంలోకి విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 2750 అడుగులు కాగా శుక్రవారం ఉదయానికి 2704 అడుగులకు చేరింది.గత ఏడాది ఇదే రోజుకు 2697 అడుగుల నీటి మట్టం ఉండేది. గత ఏడాదితో పోలిస్తే ఏడు అడుగుల నీటి మట్టం అధికంగా ఉంది. దిగువనున్న డుడుమ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 2590 అడుగులు కాగా ప్రస్తుతం 2581.20 అడుగుల నీటి మట్టం ఉంది. సరిహద్దులో గత కొన్ని రోజులుగా విస్తరంగా కురుస్తున్న వర్షాలతో జలాశయ అధికారులు ప్రాజెక్టు ఉన్నత అధికారుల ఆదేశాలతో నిరంతరం నీటి మట్టం అంచనా వేస్తూ పర్యవేక్షిస్తున్నారు.

క్లుప్తంగా

బాలింతలకు బేబీ కిట్స్ వితరణ



రోగులకు రొట్టె, పాలు అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అనకాపల్లిటౌన్: జన్మించిన బిడ్డ ఆరోగ్యంగా ఎదగాలంటే వైద్యుల సూచనల మేరకు పౌష్టికాహారం అందించాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు పి.జె.నాయుడు అన్నారు. గవరపాలెం వర్తక సంఘం ప్రసూతి ఆస్పత్రిలో 25 మంది బాలింతలకు క్లబ్ ఆధ్వర్యంలో బేబీ కిట్స్, పాలు, రొట్టెలు, పండ్లు, బూస్ట్ డబ్బాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతీ నెల రెండు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి రాపేటి నారాయణరావు, ఆస్పత్రి అధ్యక్షుడు ఆళ్ల ప్రసాద్, కార్యదర్శి కోలపర్తి కన్నబాబు, వైద్యురాలు హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ నిధుల జమ

కశింకోట: మండలంలోని రైతులకు పీఎం కిసాన్ యోజన పథకం కింద 14వ విడత రూ.2 వేలు నగదును అర్హుల బ్యాంకు ఖాతాల్లో శుక్రవారం జమ చేశారు. మండలంలో సుమారు 9,600 మందికి ఈ నగదు అందినట్లు మండల వ్యవసాయ అధికారి స్వప్న తెలిపారు. ఖరీఫ్ సాగు పెట్టుబడికి ఈ మొత్తం రైతులకు ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు.

మహిళలకు రక్షణగా ప్రత్యేక చట్టాలు

సబ్బవరం: మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని.. వాటిపై అంతా అవగాహన కలిగి ఉండాలని దామోదర సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ఆచార్య శ్రీసుధ అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం సెంటర్ ఫర్ ఉమెన్ అండ్ చైల్డ్ లా ఆధ్వర్యంలో వర్సిటీ ప్రాంగణంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మహిళల అక్రమ రవాణా, దానికి గల కారణాలను విద్యార్థులకు వివరించారు. ఉపాధి, ప్రేమ పేరుతో అమ్మాయిలు అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. ఈ అక్రమ రవాణా నేరమని, అక్రమ రవాణా నుంచి బాధితులను రక్షించడానికి అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. అక్రమరవాణా నివారణ చట్టం 1956, పోక్సో చట్టం ఉన్నాయని వివరించారు. విశ్వ విద్యాలయ వుమెన్ అండ్ చైల్డ్ లా డైరెక్టర్ ఆచార్య విజయలక్ష్మి, అధ్యాపకులు, పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 152 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	-----	------
రెండో రకం	3,850	3,850
మూడోరకం	3,750	3,750

అనకాపల్లి సినిమాలు

బేబి	: రాజా
బ్రో	: సత్యనారాయణ స్క్రీన్-1
మహావీరుడు	: సత్యనారాయణ స్క్రీన్-2
బ్రో	: షిర్డిసాయి
మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు)	: పర్తిసాయి
బ్రో	: వెంకటేశ్వర
అన్నపూర్ణ ఫొటో స్టూడియో	: శ్రీసత్య
బ్రో	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 42 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-15 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 429 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 394 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

పశువుల్లో సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

- వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం అధికం
- నిర్లక్ష్యం వహిస్తే జీవాల ప్రాణానికే ప్రమాదం
- 1962కు ఫోన్ చేస్తే ఇంటి వద్దకే వైద్య సేవలు



ఆవు ఆరోగ్యాన్ని పరిశీలిస్తున్న పశు వైద్యురాలు



వ్యాధిగ్రస్త పశువుకు చికిత్స చేస్తున్న సంచార పశు ఆరోగ్య సేవా సిబ్బంది

అనకాపల్లి రూరల్: వర్షాకాలంలో పశువుల్లో వ్యాధులు ప్రబలే అవకాశం అధికం. ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులు సాధారణమైనవే అయినా పాడిపై తీవ్ర ప్రభావం చూపుతాయి. పాడిరైతులు ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా వాటి ప్రాణాలకే ప్రమాదం వాటిల్లవచ్చు. దీంతో పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందార్లు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు పేర్కొంటున్నారు. జీవాలు ప్రమాదకర పరిస్థితిలో ఉంటే వెంటనే 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనంతో వైద్యులే ఇంటికి వచ్చి మరీ చికిత్స అందిస్తారని చెప్తున్నారు.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తం

గాలికుంటు వ్యాధి ఆవులు, ఎద్దులు, గేదెలు వంటి వాటికి ఎక్కువగా సోకుతుంది. వ్యాధి బారిన పడిన పశువు శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీలకు పెరుగుతుంది. పశువు నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగా తీసుకోలేవు. దీంతో నీరసంగా మారి నడిచేందుక్కూడా కష్టపడతాయి. పాడి పశువుల్లో అయితే పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోతుంది. వ్యాధి నివారణ కోసం వైద్యులు సూచన మేరకు యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ మందులను వాడాల్సి ఉంటుంది.

కలుషిత నీటితో జలగ వ్యాధి

మురుగునీరు, కాల్వల్లోని కలుషిత నీరు తాగడం వల్ల పశువులకు ఎక్కువగా ఈ వ్యాధి సోకుతుంది. ముఖ్యంగా గేదెలు, దూడలు, గొర్రెలు, మేకల వంటి జీవాలకు వస్తుంది. మేత తినడంలో పశువులు బాగా ఇబ్బంది పడతాయి. పాల దిగుబడీ క్షీణిస్తుంది. జలగ వ్యాధి బారిన పడకుండా పశువులకు డిస్టోడిన్ 4 మాత్రలు, 100 మిల్లీ లీటర్ల నీయోజడప్లస్‌ను అందించాలి.

నట్టల వ్యాధితో ఎదుగుదలకు బ్రేక్

పశువులు పచ్చిమేత తిన్నప్పుడు నులి పురుగుల సమస్య వస్తుంది. దీంతో వాటి ఎదుగుదలకు అవకాశం ఉండదు. జీవాలు తిన్న ఆహారమంతా నులి పురుగులే స్వాహా చేస్తాయి. దీంతో జీవాలు తరచూ రోగాల బారిన పడే అవకాశం ఉంది. వర్షాకాలంలో ఎక్కువగా గొర్రెలు ఈ వ్యాధి బారిన పడతాయి. ఎందుకంటే వర్షాలు పడి అక్కడక్కడ పెరిగే పచ్చి మేతను తిన్నపుడు ఈ సమస్య ఉత్పన్నమవుతుంది. అందుకే ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యగా ఆరు నెలలకోసారి పశువులకు నట్టల నివారణ మందులు ఉచితంగా అందిస్తోంది. ఈ ఏడాది కూడా నట్టల నివారణ మందులు సకాలంలోనే వేశారు.

గొంతువాపు.. ప్రాణాంతకం

పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గొంతువాపు వ్యాధి ప్రాణాంతకమైనది. ఈ వ్యాధి బారిన పడిన పశువుల కంటి నుంచి నీరు కారడం, నోటి నుంచి చొంగ వచ్చి శ్వాస పీల్చడానికి ఇబ్బందులు పడుతుంటాయి. గొంతు కిందకు నీరు దిగి గొంతు వాపు వస్తుంది. తీవ్రత ఎక్కువైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధి నియంత్రణకు ముఖ్యంగా జూన్, జూలై నెలల్లో(హెచ్ఎస్) టీకాలు వేస్తారు. వ్యాధి బారిన పడిన పశువులను మంద నుంచి వేరు చేయాలి.

ఇటాస్ వ్యాక్సిన్‌తో చిటుకు వ్యాధికి చెక్

వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా వచ్చే వ్యాధుల్లో చిటుకు ఒకటి. ఇది సోకినపుడు జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నివారణ కోసం జూన్, జూలై మాసాల్లో ఇటాస్ వ్యాక్సిన్ వేస్తారు. రైతులు పశువులకు సంబంధించి వ్యాధులను సకాలంలో గుర్తించి తగిన వైద్యం అందించడం వలన వాటిని నివారించవచ్చు.

నియోజకవర్గంలో పశు సంపద

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు
అనకాపల్లి	8,748	13,676	3,999	6,620
కశింకోట	7,096	10,348	7,410	8,620
మొత్తం	15,844	24,024	11,409	15,240

సకాలంలో చికిత్స చేయించాలి



పశువుల అనారోగ్యాన్ని గుర్తించిన వెంటనే సమీపంలోని పశు వైద్యులను సంప్రదించాలి. వర్షాకాలంలో పశువులకు కాలానుగుణ వ్యాధులు సోకే అవకాశం ఎక్కువ. ఎదైనా వ్యాక్సిన్ వేయిస్తే దాని ప్రభావం ఆరు నెలల వరకు ఉంటుంది. నట్టల నివారణ మందులను ఆరు నెలలకోసారి వేస్తాం. గొంతువాపు, చిటుకు వ్యాధులకు ఉచితంగా వ్యాక్సిన్ అందిస్తున్నాం. పశు సంరక్షణపై ఎలాంటి సందేహాలున్నా పాడి రైతులు స్థానిక పశు వైద్య కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించవచ్చు.

– డాక్టర్ బి.సౌజన్య, అసిస్టెంట్ డైరెక్టర్, పశు సంవర్ధక శాఖ, అనకాపల్లి

సంక్షేమంతో ప్రజలంతా సంతోషం

- మళ్లీ జగనే సీఎం అని జనాలు నిర్ణయానికొచ్చేశారు
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్



లబ్ధిదారునికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



దివ్యాంగురాలి సమస్యను వింటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, సాధారణంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్లినపుడు స్థానికులు సమస్యలను ఏకరవు పెట్టడం కనిపిస్తూ ఉంటుందని, మామిడిపాలెం గ్రామంలో మాత్రం పూర్తిస్థాయిలో అభివృద్ధి జరిగి, సమస్యలు పెద్దగా లేకపోవడం అనందాన్నిస్తోందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన మండలంలోని మామిడిపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వ్యక్తులవారీగా గణాంకాలతో సహా వివరించారు. స్థానికులను సమస్యలపై ఆరా తీశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, వారికి అందిన సంక్షేమ పథకాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన పీలా ఐశ్వర్య తాను వెటర్నరీ కోర్స్ పూర్తిచేసి, గ్రామాల్లో పశువులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నట్టు మంత్రికి తెలిపారు. సీఎం జగన్‌ను ఆదర్శంగా తీసుకుని తన వంతు సాయం చేస్తున్నట్టు పేర్కొన్నారు. పశువులకు అవసరమైన మందులను పశుసంవర్థక శాఖ తనకు అందిస్తే ఉచిత వైద్యాన్ని మరింతగా చేయనున్నట్టు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గ్రామంలో ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చిన వారికి అతి త్వరలోనే కొత్త లేఅవుట్లో స్థలాలు మంజూరు చేస్తామన్నారు. గ్రామాన్ని అనుకుని ఉన్న కొండమీద నుంచి వర్షపు నీరు పెద్ద ఎత్తున కిందకి వచ్చి, ప్రజలు ఇబ్బంది పడటాన్ని గుర్తించి, వర్షపు నీరు సక్రమంగా కాలువలోకి వెళ్లేలా పూడిక తొలగింపు పనులు చేపట్టాలని అధికారుల్ని ఆదేశించారు. అర్హులై ఉండీ సంక్షేమ పథకాలు అందని వారెవరైనా ఉంటే జగనన్న సురక్ష కార్యక్రమంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజల కష్టసుఖాలు తెలిసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకునేందుకు ప్రజలు ఇప్పటికే ఓ నిర్ణయానికొచ్చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బందం అప్పలనాయుడు, పార్టీ నాయకులు సేనాపతి హరికృష్ణ, ఒ.అప్పారావు, శ్రీను, ప్రభుత్వ విభాగాల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో 2,720 ధ్రువపత్రాల పంపిణీ



సిరసపల్లిలో ధ్రువపత్రాలను అందిస్తున్న కొణతాల మురళీకృష్ణ, జెడ్పీ వెంకటరమణ



కొత్తూరులో ధ్రువపత్రాలను అందిస్తున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సత్యవతి, తహసీల్దార్ గంగాధర్

అనకాపల్లిటౌన్: జగనన్న సురక్ష కార్యక్రమం నెల రోజుపాటు యజ్ఞంలా సాగిందని, ప్రజల నుంచి మంచి స్పందన రావడమే కాకుండా ధ్రువపత్రాలను నేరుగా అందించడం ఆనందంగా ఉందని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి అన్నారు. మండలంలోని కొత్తూరు పంచాయతీ కార్యాలయం వద్ద తహసీల్దార్ గంగాధరరావు, పాపయ్యసంతపాలెం గ్రామంలో ఎంపీడీవో కె.వి.నరసింహారావు, జీవీఎంసీ విలీన గ్రామాలైన సిరసపల్లి రామాలయ కల్యాణ మండపంలో జెడ్పీ ఎస్.వెంకటరమణ ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా వంటి విపత్తు సమయంలో రాష్ట్రానికి ఆదాయం లేకపోయినా అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ప్రభుత్వానికే దక్కిందన్నారు. పార్టీలకు అతీతంగా వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు సకాలంలో అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డేనని కొనియాడారు. జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా 11 రకాలైన ధ్రువపత్రాలను అందిస్తున్నట్టు తెలిపారు. ప్రజల ప్రతి అవసరం తీర్చేందుకు కృషి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకునే బాధ్యత మన అందరిపైనా ఉందని, అభ్యర్థించారు. జీవీఎంసీ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజాసంకల్ప యాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలు సమస్యలను తెలుసుకుని నవరత్నాలను ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చి, శతశాతం అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం కొత్తూరులో 820, పాపయ్యసంతపాలెంలో 900, సిరసపల్లిలో వెయ్యి ధ్రువపత్రాలను దరఖాస్తుదారులకు అందించారు. కార్యక్రమాల్లో కొత్తూరు సర్పంచ్ ఎస్.లక్ష్మీ ప్రసన్న, వైఎస్సార్‌సీపీ 83వ వార్డు ఇన్‌ఛార్జి జాజుల రమేష్, ఈవోఆర్డీ ధర్మారావు, జీవీఎంసీ ఏపీడీ డి.కె.దొర, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి విద్యుత్ కార్మికుల ధర్నా



విద్యుత్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

అనకాపల్లిటౌన్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు, డిమాండ్లతో కూడిన కరపత్రాలతో ధర్నా చేపట్టారు. స్థానిక గవరపాలెం విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద రెండోరోజు శుక్రవారం నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా ఆ శాఖ జేఏసీ నాయకులు ఎ.నూకరాజు, పేరపు రాంబాబు, పడాల సోమన్న దొర, చవితిని నరసింహారావులు మాట్లాడుతూ అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, జేఎల్ఎం గ్రేడ్-2లను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలను చేపట్టి, డీఏ బకాయిలు చెల్లించాలని, ఏకసభ్య కమిషన్ నివేదికను రద్దు చేసి, పీఆర్సీ 2022ని తక్షణమే అమలు చేయాలని కోరారు. ఎస్పీలు, పీపీలు లేకుండా అందరికీ ఒకే మాస్టర్ స్కేల్ ఇవ్వాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు శ్రీనివాసరావు, పి.కుంచుబాబు, సీహెచ్ కుమార్, సీహెచ్‌వీ సత్యనారాయణ, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన డీపీవో



కొబ్బరి మొక్కను నాటుతున్న డీపీవో శిరీషారాణి

తుమ్మపాల: ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటాలని, పచ్చని ప్రకృతితోనే ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి తెలిపారు. మండలంలోని రేబాకలో ఉన్న జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన ప్రపంచ ప్రకృతి దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో ఆమె కొబ్బరి మొక్కలను నాటారు. పర్యవరణాన్ని పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రేబాక సర్పంచ్ మార్టూరు సన్యాసమ్మ, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, రామకృష్ణ, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలతోనే పరిశుభ్ర వాతావరణం



మొక్కలను పంపిణీ చేస్తున్న శరగడం జయలక్ష్మి

అనకాపల్లిటౌన్: భావితరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత మన అందరిపై ఉందని నోబుల్ చారిటీస్ అధ్యక్షురాలు శరగడం జయలక్ష్మి అన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గవరపాలెం చారిటీస్ ఆవరణలో శుక్రవారం ఉచితంగా మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భగవంతుడు మనకు స్వచ్ఛమైన నేల, నీరు, గాలితో కూడిన ప్రకృతిని ప్రసాదించారని, ప్రపంచ వ్యాప్తంగా ఈ ప్రకృతి వనరుల్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ప్రతీ వ్యక్తి మూడు మొక్కలను నాటి, వాటిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షుడు ఓంరామ్, చారిటీస్ వ్యవస్థాపకుడు శరగడం నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్, క్రీడాకారులకు సూచన

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఈ నెల 29న నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీ ఎస్.వెంకటరమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో క్రీడా మైదానానికి రెగ్యులర్‌గా వచ్చే వాకర్స్, క్రీడాకారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా కోరారు.

అమర్‌నాథ్ చెప్పారు.. 'అరబిందో' చేశారు

- నేడు మంత్రి చేతుల మీదుగా సైకిళ్ల పంపిణీ
- నియోజకవర్గంలోని 2,550 మంది విద్యార్థినులకు లబ్ధి



పంపిణీకి సిద్ధం చేసిన సైకిళ్లు

అనకాపల్లిటౌన్: నియోజకవర్గంలోని సర్కారు బడుల్లో విద్యనభ్యసిస్తున్న బడుగు, బలహీనవర్గాలకు చెందిన బాలికల ఆనందం అంబరాన్నంటుతోంది. పేదలకు విద్యను మరింత చేరువ చేసేందుకు మంత్రి అమర్‌నాథ్ మరో ముందడుగు వేశారు. బాలికలు చదువుకు దూరం కారాదని, చదువు పట్ల వారిలో ఇష్టత పెంచేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా అరబిందో ఫార్మా కంపెనీ ప్రతినిధులతో చర్చించి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10 తరగతుల విద్యార్థినులకు సైకిళ్లను అందించేందుకు చొరవ చూపారు. ఆయన కోరిక మేరకు ఒక్కోటి రూ.6,500 విలువ చేసే 2,550 సైకిళ్లను అందించేందుకు అరబిందో సంస్థ ముందుకొచ్చింది. ఈ మేరకు సిద్ధం చేసిన సైకిళ్లను స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో శనివారం పంపిణీ చేయనున్నారు.

చాలా ఆనందంగా ఉంది



ఇంటికి, స్కూల్‌కి మధ్య కిలో మీటర్ పైనే దూరం. రోజూ నడిచే రాకపోకలు సాగిస్తున్నా. ఇపుడు సైకిల్ ఇస్తారని తెలిసినప్పటి నుంచి చాలా ఆనందంగా ఉంది. ఎపుడెపుడు సైకిల్ తీసుకుంటానా? అని ఆశగా ఎదురుచూస్తున్నా. ఇక స్కూల్‌కి, ట్యూషన్‌కి కూడా సైకిల్‌పైనే వెళ్లిరావొచ్చు.

– బి.భాగ్యశ్రీ, 10వ తరగతి, కాపుశెట్టివానిపాలెం

చదువుపై మరింత ఇష్టం



చదువుకునేటపుడు కొత్త వస్తువు ఇచ్చే ఆనందం మరేదీ ఇవ్వదు. స్కూల్ తెరిచినపుడే జగనన్న విద్యా కానుకతో ఆనందాన్నిచ్చారు. ఇపుడు సైకిళ్ల పంపిణీతో చదువుపై ఇష్టం పెరుగుతోంది. బాగా చదివితే జగన్ మామయ్య ప్రభుత్వం మా వెన్నంటి నిలుస్తుందన్న నమ్మకం పెరిగింది.

– పి.కీర్తన, 9వ తరగతి, మూలపేట

మా నాన్నకు ఆనందం



మాది పేద కుటుంబం. అమ్మానాన్నకు చాలాసార్లు సైకిల్ కోసం అడిగా. మా నాన్నకు అంత స్తోమత లేక సైకిల్ కొనలేకపోయారు. స్కూల్ ద్వారా సైకిల్ వస్తుందన్న విషయం తెలుసుకున్న మా అమ్మానాన్న ఆనందం చెప్పలేనిది. నాన్నలో ఇన్నాళ్లూ ఉన్న ఆత్మన్యూనత పోయింది.

– సీహెచ్ఎన్ ప్రవల్లిక, 10వ తరగతి, రేబాక

క్వారీ లారీల నియంత్రణకు చర్యలు

- అధికారులను కోరిన మాజీ మంత్రి దాడి వీరభద్రరావు



దాడి వీరభద్రరావు

తుమ్మపాల: అనుమతుల్లేకుండా అర్ధరాత్రులు తిరుగుతున్న క్వారీ లారీల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అధికారుల్ని కోరారు. పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలీస్, మైన్స్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల నిర్లిప్త వైఖరిని తప్పుబట్టారు. ఇసుకను అడ్డగోలు తవ్వేయడంతో శారదానది, వెంకుపాలెం వంతెన గ్రోయిన్లు పూర్తిగా నాశనమైనట్టు తెలిపారు. దాదాపు 20 వేల ఎకరాల పంట భూములు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనధికారిక తవ్వకాలతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందన్నారు. కొండలను చదునుచేసి అనధికారిక లేఅవుట్ వేసి సెంటు రూ.3 లక్షల వరకు అమ్మకాలు జరుపుతున్నారని ఆరోపించారు. క్వారీ లారీ ఢీకొని ధ్వంసమైన ఎన్టీఆర్ విగ్రహం స్థానంలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, లారీ యజమానికి సూచించినట్టు తెలిపారు.

ఉచిత సైకిల్ కూపన్ల పంపిణీ



తాళ్లపాలెంలో బాలికలకు సైకిల్ కూపన్లను అందిస్తున్న గణేష్

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం జెడ్పీ హైస్కూల్లో 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థినులకు ఉచిత సైకిళ్ల కూపన్లను శుక్రవారం అందించారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవతో అరబిందో ఫార్మా సంస్థ సహకారంతో 69 మంది బాలికలకు శనివారం అనకాపల్లిలో సైకిళ్లు అందించనున్నారు. ఈ మేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి, కూపన్లు అందించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా యువజన విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, హెచ్ఎం విజయలక్ష్మి సుమన్, స్కూల్ కమిటీ అధ్యక్షుడు గుమ్మడి గోవింద, పాల సంఘం అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పని దినాల కుదింపును ఉపసంహరించాలి

అనకాపల్లిటౌన్: తమకు కుదించిన పనిదినాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ సంఘ సభ్యులు స్థానిక విద్యుత్‌శాఖ డీఈ రామిరెడ్డిని ఆయన కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందించారు. రీడర్లకు కాంట్రాక్టర్ల ద్వారా మొబైల్స్‌ను పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఆర్.కుమారస్వామి, ఎస్.శ్రీనివాసరావు, డి.క్రాంతికుమార్, పి.నాగబాబు, బి.సుబ్రహ్మణ్యం, బి.రాజు, షేక్ గఫూర్, ఎం.వెంకటసుబ్బయ్య, సి.రమేష్, ఎం.రామాంజనేయులు, ఎం.జయసుధాకర్, కె.ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

సబ్బవరం: పొదుపు సంఘాల మహిళలు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని వెలుగు ఏపీఎం సాయిరమేష్ అన్నారు. మండలంలోని అసకపల్లి శివారు గణపతినగర్‌లో శుక్రవారం మహాగణపతి గ్రామ పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామ సంఘం ఆర్థిక లావాదేవీలు, ఇతర ప్రభుత్వ పథకాల కోసం చర్చించారు. ఏపీఎం సాయి రమేష్ పలు సూచనలు చేశారు. గ్రామం సంఘం అధ్యక్షురాలు కోన సోమలత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీసీ నీలకంఠ నాయుడుతో పాటు గ్రామ సంఘం పాలకవర్గ సభ్యులు రేసుపుడి కుమారి,కర్రి ధనలక్ష్మి, మామిడి వరహాలమ్మ, మామిడి లక్ష్మి మిగతా గ్రూపు లీడర్లు, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణంపై గ్రామసభ



గ్రామసభలో రైతుల పేర్లను చదువుతున్న డీటీ శ్రీరామమూర్తి

అనకాపల్లిటౌన్: జీవీఎంసీ విలీన గ్రామమైన కేఎస్ఆర్ పేట నుంచి రాజుపాలెం వెళ్లే రహదారిలో రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణానికి భూసేకరణ నిమిత్తం శుక్రవారం 25వ సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. తొలుత డిప్యూటీ తహసీల్దార్ శ్రీరామమూర్తి వంతెన నిర్మాణానికి భూములిచ్చే రైతుల పేర్లను చదివి వినిపించారు. ముందస్తు సమాచారం లేకుండా గ్రామసభ ఏర్పాటు చేసి వంతెన నిర్మాణానికి తమ భూములు కోరడం సరికాదని, తమకు కొంత సమయం కావాలని రైతులు కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొణెడ్డి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సిరసపల్లి సన్యాసిరావు, రైతులు పాల్గొన్నారు.